

# జీవన వలయం

### శారదా అశోకవర్ధన్

'సంపత్ పోయాట్ట తెలుసా' అంది మాలతి.

ఉలిక్కిపడ్డాను "సంపత్ పోయాడా ? ఎప్పుడు ? ఎలాగ ?"

"మొన్నరాత్రి పోయాడు. ఏదో రోగాలంటుకున్నాయట. అయినా శోభా నీకు తెలీదా ? అతను పోయినట్టు" ఆశ్చర్యంగా అడిగింది మాలతి.

"న్యాయంగా తెలియవలసిందే కాని తెలీలేదు. నేను వారంరోజుల్నుంచీ ఊళ్ళోలేనుగా. స్నేహితుని పెళ్ళికెళ్ళొచ్చాం. నల్లగొండ. అందుకే తెలీలేదు"

అన్నాను విచారంగా. "నీ తలకాయ్. అతను మంచంపట్టి ఆర్నెల్లయిందిట. మీ అత్తయ్య కొడుకేగా. పరాయివాళ్లా తెలీకుండా వుండటానికి". "మాలతీ నువ్వనేది నిజమే. దగ్గర బంధుత్వమే వుంది. కానీ మామధ్య అంతులేని దూరంకూడా వుంది. అదే డబ్బు మహత్యం. మా అత్తయ్య కేవలం డబ్బు మనిషి. ప్రేమతో పలకరించడానికి వెళ్ళినా, తన డబ్బుకోసమే వొచ్చారనుకుంటుంది. అందుకే అయినవాళ్ళందరూ ఆమెకి దూరమయ్యారు. ఆ కొడుకూ, డబ్బు ఈ రెండే అవిడికి ప్రాణాలు" అన్నాను ఆవేశాన్నణచుకుంటూ.

మాలతి గట్టిగా నవ్వడం మొదలెట్టింది.

ఎందుకు నవ్వుతోందో అర్థంగాక వెఱ్ఱివాసిలా దాని మొహం చూస్తున్నాను. నా అయోమయావస్థచూసి మాలతి మరింత నవ్వడం మొదలెట్టింది. ఒక్కసారిగా నవ్వాపి, "శోభా! ఈ లోకంలో ఎవరికి ఎవరూ ఏమీకారే. ప్రేమా, న్యాయం, బంధం, అనురాగం. అప్యాయతా అంతా మిథ్య, అంతాకల్ల, ఎవరి స్వార్థంకోసం వాళ్ళు అల్లుకున్న తీగెలవి, వాటి పేరుతో ఎదురివారిని బందీనిచేసి వారి స్వార్థానికీ, స్వలాభానికీ వాడుకుంటారు". ఉద్రేకంతో ఉపన్యాసంలా చెప్పుకుపోతోంది మాలతి.

"ఏమిటిలా మాట్లాడుతున్నానని ఆశ్చర్యపోతున్నావు కదూ! నువ్వు నమ్మవు నాకు తెలుసు.నువ్వూ ఆ బంధాలలో చిక్కుకున్న బందీవే కాబట్టి. తల్లీ పిల్లా అన్నా చెల్లె ఈ బంధాలన్నీకూడా డబ్బుముందు బలాదూర్,డబ్బుకులోకం దాసోహం డబ్బు...డబ్బు...డబ్బుంటే చాలు, ఏమైనాచెయ్యొచ్చు ప్రపంచంలో! ఎవడిక్కావాలి ప్రేమగీతాలూ, నీతిపాఠాలూ" ఆవేశంతో దాని మొహం ఎఱ్ఱబడింది. దుఃఖంతో దాని కళ్లు అశ్రుపూరితాలయ్యాయి కళ్లు తుడుచుకుని మళ్ళీ చెప్పడం మొదలెట్టింది.

"మీ సంపత్ వైద్యం లేక చచ్చిపోయాడు తెలసా?'' అంది.

"ఆఁ..." అన్నాను తెల్లబోయి.

"అవును! ఆశ్చర్యంగానే వుంటుంది. పరోపకార పరాయణుడు, సత్సంపన్న కుటుంబీకుడు, దాదాపు 2 లకారాలకు తక్కువ లేకుండా భార్య కొదిలిపెట్టి కేవలం, పేరు ప్రతిష్ఠలను తన వెంట గొనిపోయిన ధన్యజీవి, అంబరాల ఆంజనేయులుగారి ఏకైకపుత్రుడు, ఈనాడు సరియైనవైద్యంలేకఅర్థాయుష్షుతోకన్ను మూశాడంటే ఆశ్చర్యంగా నే వుంటుంది తల్లి చేతుల్లో బలిఅయినఅమాయకుడు" చెప్పుకుపోతోంది మాలతి.


అంతవరకూ ఓపిగ్గా వింటున్న నాకు మతిపోయింది దాని పిచ్చివాగుడికి ఒళ్ళు మండిందికూడా. ఎక్కడైనా కన్నతల్లి

తన బిడ్డను చేతులా చంపుకుంటుందా ? తన ప్రాణాన్నడ్డుపెట్టేనాసరే తన బాబుని కాపాడుకుంటుంది. తన సర్వ స్వం ధారపోసి, తన పిల్లల ప్రాణాలు కాపాడుకుంటుంది. అసలు అమ్మ అనే పదంలోనే వుందే ఆ కమ్మదనం, ఆకర్షణ మాటరాని మూగజీవులు. పశుపక్షాదులు సయితం, బిడ్డలరక్షణకోసం పడేపాట్లు, కళ్ళారా చూసినవి, కథల్లోవిన్నవీబోలె డుంటే, మానవ జన్మనెత్తి అగ్రస్థానా న్నందుకున్న మాతృప్రేమనే లోకం శంకిస్తే, మరి జీవితంలో బంధమేది, జీవితానికి అర్థమేది'' నాలో నేనను కుంటూన్నట్టుగా, నాకు తెలీకుండా గట్టిగానే అనేశాను.

"నిజమే, అందుకే మొదలే చెప్పా నుగా నువ్వు నమ్మవని. ఈ లోకంలో కొన్ని సిద్ధాంతాలు స్థిరంగా నిలిచి పోయాయి. కన్నతల్లి అనగానే, తప్పక తన బిడ్డలకి రక్షణనిచ్చే కల్పవల్లియని అదే స్థానంలో సవతితల్లిగానీ, మరెవ రైనా గానీ వుండి నిజమైన ప్రేమతో, ఎంత త్యాగాన్ని చేసినా, "ఆ... ఎంతైనా కన్నతల్లి అవుతుందా అని" అనడం మనకు పరిపాటి అయి పోయింది.

"శోభా నీకు జీవితంలో అనుభవం తక్కువ. పెద్దకుటుంబంలో పుట్టావు. గారాల పట్టిగా పెరిగావు. తల్లిదండ్రుల ప్రేమకీ, అన్నదమ్ముల ఆప్యాయతకీ నోచుకున్నావు. నీకు అందుకే ఇతర ప్రపంచం తెలీదు. నే చెప్పినవన్నీ విని నీ ఇష్టమొచ్చినట్టు తీర్పునిద్దువుగాని" అంది గంభీరంగా మాలతి. దాని కంఠంలో ఏదో మరుగుపడిపోయిన సత్యాన్ని వెతికి తవ్వితియ్యాలన్నట్టుగా నిశ్చలత్వం గోచరిస్తోంది. చెప్పటం మొదలెట్టింది. "శోభా...మాకో అత్త య్యుండేది. ఆవిడకి చిన్న తనంలోనే అయిన కుటుంబంలో అబ్బాయితోనే యధావిధిగా పెళ్ళిచేశారు. అయితే భర్త కొంచెం కురూపి. దాదాపు పది సంవత్స రాలు వారి సంసారం చక్కగానే సాగింది. నలుగురు పిల్లల తల్లి అయింది. ముగ్గురుఆడపిల్లలూఒకమగపిల్లాడూనూ. తల్లీ తండ్రి, అత్తా మామా ఎంతో సంతోషించేవారు ఆ పిల్లల్నీ వారి సంసారాన్నీ చూసి. కానీ ఏంజరిగిందో తెలుసా ?" ప్రశ్నార్థకంగా తన కళ్ళ ల్లోకి చూస్తూ కూర్చున్నాను. ఏంజరి గిందోనన్న కుతూహలంతో "ఒక శుభముహూర్తాన ఉన్నట్టుండి ఆమె లేచిపోయింది. తన సంసారాన్నీ భర్తనీ పెద్దల జాలికీ భగవంతుడి దయకీ ఒదిలేసి."

"మరి పిల్లలేమయ్యారు ? అందరూ చంటిపిల్లలంటున్నావే ? వారి నెవరు పెంచారు ? ఆవిడ తిరిగిరాలేదా ? ప్రశ్నల పరంపర కురిపిస్తూన్న నన్ను చూసి "అగుమరీ" అంటూ మళ్ళీ మొద




లెట్టింది మాలతి. "80 ఏళ్ళ నాయనమ్మా 80 ఏళ్ల తాతయ్యా పెంచారు. ముగ్గురు ఆడపిల్లలకి చిన్నతనంలోనే ముచ్చటగా పెళ్ళిళ్ళుచేసి ఒక యింటి వాళ్ళనుచేశారు తల్లిలేకపోతే నాయనమ్మ దగ్గరో అమ్మమ్మ దగ్గరో పెరగటం సహజంకానీ, తల్లి బ్రతికుండి పిల్లలు, అమ్మఅని పిలుచుకునే భాగ్యానికి నోచుకోలేదంటే ఆపిల్లల హృదయాల్లో గూడు కట్టుకున్న బాధ ఎవరికి అర్థమవుతుంది పెళ్ళిపందిట్లో ఆ కొఱత ఎంతగా కనబడిందో, పందింట్లో మంచున్నవారి కన్నీళ్ళు చెబుతాయి." నిజంగా దాని మాటలు వింటూవుంటే అక్షణంలో నాకు ఏమిటో ఏడుపొచ్చినట్టనిపించింది.

"మరి ఆవిడ సంగతేమిటి? కనీసం ఈ పిల్లల్ని చూడటానికికూడా ఒక్కసారైనా రాలేదా?"

"లేదు, ఆమె మరో పెళ్ళి చేసుకుంది. ఆ భర్తకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళూనూ, ఒకకొడుకు పుట్టు మూగి, పెద్దమ్మాయికి బ్రహ్మ చెవుడూనూ. ఈ పిల్లలు చేతికందకుండానే అతను కళ్ళుమూశాడు. తరవాత ఈ బిడ్డలపోషణకోసం ఆమె పడ్డపాట్లు తలుచుకుంటే గుండె చెరువవుతుంది" అంది మాలతి." నాకు ఆశ్చర్యం వేసింది.

"ఏమిటే నువ్వంటూన్నది. మొదటి భర్తకు పుట్టిన నలుగురు పిల్లల్నీ గాలి కొదిలేసి ఈ పిల్లల పెంపకంకోసం అష్టకష్టాలుపడిన ఆమెని ఏమనాలో


అర్థంకాలేదు. హృదయంలేని కఠినాత్ము రాలా ? ప్రేమాభిమానాలూ బాధ్యతా ఎరుగని ప్రౌఢా అంటే తరవాత పుట్టిన పిల్లలకోసం రెక్కలు కొట్టుకుని తన కడుపు మాడ్చుకునైనా వారిని పోషించి, వృద్ధిలోకి తేవడానికి బాధలు పడుతోంది. మరి ఈ బాధ్యతా ప్రేమా అవన్నీ ఆపసికందులపై లేవేమిటి ? భర్తనచ్చకపోవచ్చు. ఆయింట్లో వాళ్ళు నచ్చకపోనచ్చు. కానీ నవమాసాలూ మోసి, కని, వొళ్ళోపడుకోబెట్టుకుని చను పాలు త్రాగించిన తల్లికి, పిల్లలందరూ ఒక్కటేకాదా ? మాతృదేవతకే పక్ష పాతం వుంటే మనుగడ సాధ్యమా ? కానీ ఆమె కనీసం, ఒక్కసారైనా వాళ్ళని చూడటానికి రాలేదంటే ఏమం టావ్ ?" ప్రశ్నించింది మాలతి.

ఏమిటో మనస్సంతా వికలమై పోయింది ఏది నమ్మాలో, ఏది నమ్మ కూడదో తెలియని అయోమయావస్థలో పడ్డాను. అది గ్రహించిన మా మాలతి, టాపిక్ మారుస్తూ "శోభా... ఈసోదంతా ఇప్పుడెందుకులేగానీ, కాస్త కాఫీ ఇవ్వు, నీ చేతి కాఫీతాగి చాలా రోజులయింది" అంది. "అయ్యో నా తెలివి తెల్లవారా. కాఫీ కలిపిపెట్టి నీ మాటల్లోపడి మరిచే పోయాను" అంటూ వెళ్ళి చల్లారిపోయిన కాఫీని వేడి చేసి, రెండు కప్పుల్లోపోసి దానికోటిచ్చి, నేనోటితీసుకున్నాను. నోటికి వేడి కాఫీసిప్ తగలగానే బుఱ్ఱలో మళ్ళీ ఆలోచనలు రింగులు తిరగ సాగాయి. "అమ్మాయిగారింకా ఆలో చనల్లోంచి తేరుకోనట్టుంది" అంది నవ్వుతూ మాలతి.

"ఒక్క విషయం నాకర్థం కావడం లేదే మాలతీ, మా అత్తయ్య ఎంత డబ్బు మనిషైనా కొడుకుని మాత్రం పువ్వులా పెంచింది. నాకు బాగా జ్ఞాప కం. సంపత్‌ని ఎవ్వరితోటీ చేరనిచ్చేది కాదు. చెడు సహవాసాలబ్బి పాడైపోతా డని. అందుకే వాడికి పదహారుఏళ్ళువచ్చే దాకా పేరంటానికికూడా తనతో తెచ్చేది కాదు వాడికిరెండుచెంచాలకన్నా ఎక్కువ పెట్టేదికాదు అన్నం, ఏమడిగినా తినటాని కిచ్చేదికాదు, అరముక్క బిస్కెట్టు తప్ప, అజీర్ణంచేసి జబ్బులొస్తాయని, అంత జాగ్రత్తగా పెంచిందే ఆమె, ప్రేమ లేకుండానే చేసిందంటావా :"

అదోలా నవ్వింది మాలతి.

"శోభా! ప్రేమలేదని అనను. కాని ఆమె మొదటి ప్రాణం డబ్బు. తరవాతే కొడుకు. చెంచాల అన్నంపెట్టి, ఏదీతిన డానికి ఇవ్వకపోవడంలో ముందు పాయింటు ఆవిడకి పొదుపు. తరవాతే వాడి ఆరోగ్యాన్ని గురించిన బెంగ. ఇహ ఎవ్వరితోటీ అతన్ని కలవనివ్వ కుండా జాగ్రత్తపడడం, చెడిపోతాడన్న బెంగకంటే, తమలాంటి ధనవంతుల బిడ్డ, మామూలు వాళ్లతోకలిసిమెలిసి ఉండకూడదని తెలుసా ? అంతా




స్వార్థం. వాడిబాగోగులు చూసే తల్లే అయితే, వాణ్ణి ఆవిధంగా పెంచి వుండదు, నాలుగుగోడల మధ్య తనకొంగు చాటున. దానివల్ల ఏమైంది ? ఆమె స్వార్థానికి, వీడు బలయ్యాడు. నలుగురిలో మాట్లాడటం చాతకాక, లోకపుతీరు తెలుసుకునే అవకాశం లేక సమాజంలో చవటగా కట్టుబడిపోయాడు. నలుగురిలో నవ్వుల పాలైపోయాడు. ఇలా చాలామంది స్త్రీలు తమ మూర్ఖత్వంవల్ల తమ పిల్లల భవిష్యత్తు చేజేతులా నాశనం చేసుకుంటారు. చివరికి ఏంజరిగిందో తెలుసా ? నువ్వూహించనైనాలేవు. రెచ్చగొడితే పిల్లిపిల్ల కూడా పులిపిల్లలా విజృంభిస్తుంది. లోకంకూసే కూతలకి పౌరుషమే ఒచ్చిందో లేక, తనలో నిద్రాణమై వున్న కోరికలు ఒక్కసారి చెలరేగి ఎదురుతిరిగాయో కానీ సంపత్ మధువూ, మగువా రెంటికీ అలవాటుపడి జబ్బులు కొనితెచ్చుకున్నాడు'' చెప్పటం ఆపింది మాలతి. టేబులుమీదున్న వక్కపొడి నోట్లో వేసుకుంటూ. ''మాలూ! నువ్వేమైనా చెప్పుకానీ, సంపత్ ఇటువంటి పన్లు చేశాడంటే నమ్మను" అన్నాను. నా అభిప్రాయానికి తిరుగులేదన్నట్టు.

"నువ్వనేది నిజమే. సంపత్ తనకు తానుగా ఎటువంటి పరిస్థితిలోనూ, ఇటువంటి పన్లుచెయ్యలేదు. కానీ సంఘంలో, కొన్ని చీడపురుగులు ఎప్పుడు ఎవరిని పడదామా అని, ఎదురుచూస్తూ వుంటాయి. ఆటువంటివారి చేతుల్లో పడి నశించేది, ఇటువంటి అమాయకులే.

జాలరిలా వలవేసి పడతారు ఇటువంటి చేపల్ని. కొన్ని వలలో చిక్కుకుని గిల గిలా కొట్టుకుంటూవుంటే చూసి ఆనం దిస్తారు. తరవాత స్వాహాచేస్తారు. మళ్లీ కొత్తచేపలకోసం ప్రయత్నాలు చేస్తారు. రాక్షసులు, డబ్బుకోసం గడ్డితినే పశు వులు, కొంపలుకూల్చే కోడెత్రాచులు. కుళ్లువాసనలను పట్టుచీరలతో కప్పుకునే కపట వేషధారులు. వీరిచేతుల్లో సంపత్ లాంటి అమాయకులే ఆహుతైపోతారు'' ఆవేశంతో ఊగిపోతోంది మాలతి. దాని కళ్ల రౌద్రింతో చింతనిప్పుల్లా మెరుస్తూ న్నాయి. నాకు భయంవేసింది, దాని ఆవేశంచూసి. "మాలా" అన్నాను, దాని చెయ్యిపట్టుకుని.''

"అవును శోభా! నువ్వు ఇంట్లో వున్న దానివి నీకివేవీ తెలీవు పదిమందిలో వివిధ మనస్తత్వాల వారి మధ్య మెలు గుతూ, ఉద్యోగంచేసే నాకు తెలుస్తుంది ఈ గొడవంతా'' అంది. ''మాలా" అన్నాను మళ్లీ దానిధోరణి మార్చాలని. "ఊ'' అంది ఎంతో నిదానంగా.

''హమ్మయ్య" అని ఊపిరిపీల్చు కుని, ''అవును గానీ మాలూ, ఇందాకటి నుంచి చూస్తున్నాను నీధోరణి, ఆడ వాళ్లను దుయ్యబడుతున్నావు కానీ ఇటు వంటివారిని ఆదరించి ప్రోత్సహించే, మగవారినేమంటావ్? వారిలాలనా, పాలనా చూసేగా, ఇటువంటి ఆడవాళ్లు విఙ్ఞవీగటం. నన్నడిగితే, వీరిని చేర దీస్తున్న మగవాళ్లదేతప్పంటాను ముమ్మా టికీను'' అన్నాను. మళ్లీ మాలతి అదోలా నవ్వింది. నాకు తెలుసు. మా మాలు అలా నవ్వింది అంటే ఆ నవ్వు వెనక వేనవేల అర్థాలుంటాయని. అందుకే దాని మొహంలోకి చూస్తూ ''కాదంటావా'' అన్నాను. "కాదనను. కానీ నువ్వనేది పూర్తిగా ఒప్పుకోను. చూడూ ఆడదాని ఓరచూపులకీ, కిలకిలలకీ, చలించని పురుషుడంటూలేడు. ఉన్నానని ఎవరైనా చెబితే అతనికి నిజంచెప్పే ధైర్యంలేక ఆత్మవంచన చేసుకుంటున్నాడంటాను. స్త్రీని ప్రకృతితో పోల్చారు కవులు. ప్రకృతిలో ఒకభాగమే స్త్రీ. ప్రకృతి పులకింతకి పులకించని పురుషుడు వున్నాడూ అంటే ఆతను సర్వసంగ పరి త్యాగియై పంచభూతాలనూ జయించిన యోగి అయినా అయ్యుండాలి, లేదా మోడులా జీవించే హృదయంలేని మని షైనా అయ్యుండాలి. ప్రకృతిలోని శక్తి నంతా పుంజుకున్న మగువ, మగాడిని బొమ్మలా, కమ్మగా కవ్విస్తుంది. రంభలా ఆడిస్తుంది. సత్యభామలా పాదా క్రాంతుణ్ణి చేసుకుంటుంది తన శక్తిని గ్రహించిన లలన! విచ్చి విచ్చి వేష ధారణతో, విచ్చలవిడిగా తిరుగుతూ స్వైరవిహారం చేసే మనకి లేని పరువు మగాడికెందుకూ? అతనూ సై అంటాడు. అతనిని రెచ్చగొట్టి రచ్చకీడ్చడం భావ్య మంటావా? చెప్పు?

"నువ్వన్నదీ నిజమే. అవయవాలను దాచే ఆరుగజాల చీరకి బదులు అంగ సౌష్ఠవాన్ని ఎత్తిచూపే బెల్ బాటములూ, లుంగీలూ వొచ్చాయి. చూడకుండా కళ్లు మూసుకోంగదా."

"అదికాదు నేననేది. కాలాన్ని బట్టి మనుషులూ మారాలి. ఆహారవిహారాదులన్నింటిలోనూ మార్పు రావడం సహజం. కానీ సమయాన్ని బట్టీ, సందర్భాన్నిబట్టీ వేషధారణ. పదిమందిలో ఉద్యోగాని కొచ్చినప్పుడు సింపిల్‌గా నీట్‌గా వుండాలి. భర్తతో పార్టీకి వెళ్లినప్పుడు మనిష్టం. మనలో నిగూఢమైయున్న శక్తుల్ని మంచిపనులకై వినియోగించుకోవాలి. పట్టుదలా, కార్యదీక్షా, ఓపిక, సహనం, క్షమాగుణం, ఇవన్నీ ఆడవాళ్లకి భగవంతుడిచ్చిన అభయాలు. వీటితో సాధించలేనిదంటూ ఏదీలేదు. అందుకే అవకాశాలుంటే ఆడవాళ్లు అన్నిరంగాలలోనూ అగ్రగణ్యులవుతున్నారు. గృహనిర్మాణ కార్యక్రమాలలోనూ, రాజకీయ చతురతలలోనూ, ఇంటాబయటా కూడా ఉత్తమ స్థానాన్ని పొందుతోంది స్త్రీ. అంటే అంతటి శక్తివంతురాలన్నమాట. శక్తికి మారుపేరే స్త్రీ. ప్రళయానికి పతనానికీ మారుపేరుకూడా స్త్రీయే—"ఉద్రేకంతో చెప్పుకుపోతోంది మాలూ. "ఆఁ... ఆఁ...చాల్లే తల్లీ ఉపన్యాసం... అసలే ఒకప్రశ్నకి నాలుగు సమాధానాలు చెప్తావునువ్వు.అందులోనూ కవయిత్రివి. ఇప్పుడు ఉపన్యాసం మొదలెడితే, వినే ఓపిక లేదు నాకు. చాలా అలిసిపోయావ్ కానీ టిపిన్ తిందువుగాని పద" అంటూ లేచాను. "నువ్వన్నదీ నిజమే. ప్రణయానికీ ప్రళయానికీ కూడా స్త్రీయే కర్త." అంటూలేచాను, టిపిన్‌పెట్టడానికి. "సరే పద. ఇదీ ఒకబంధమే. ప్రేమా, అనురాగం, అసూయ, ద్వేషం, త్యాగం, స్వార్థం, ఇవన్నీకూడా జీవనవలయంలో కొన్ని భాగాలు" అంటూ నా వెనకాలే వస్తూన్న మాలతికేసి చూసి, మావారు, ఎప్పటినుండి వింటున్నారో మా సంభాషణ "చూడండి మాలతిగారూ...జన్మనెత్తిన ప్రతివ్యక్తీ ఈ వలయంచుట్టూ ప్రదక్షిణం చెయ్యవలసిందే. విజ్ఞులు కొన్ని ప్రదక్షిణాలుచేసి ఈ పరిధిని దాటి ఆవలి అంచులు చూడటానికి ప్రయత్నిస్తారు. అదే ముక్తిమార్గం. అజ్ఞాని ఆ వలయంలోనే తిరిగితిరిగి వేసారి, ఆవలి అంచులు చూడకుండానే అంతమౌతాడు. ఇదే జీవిత రహస్యం. ఇంతకీ ఇవాళంతా ఫిలాసఫీ లోకిదిగిందే ధోరణి బావగారిమీద అలిగిరాలేదు కదా" అంటూ నాచేతిలోని వేడివేడిగా నోరూరిస్తూన్న ఆవడలను చూసి, టిఫిన్ పళ్లెంతో మాలతి వెనకాల క్యూలో నుంచున్నారు లొట్టలువేస్తూ.